''నీకు?''

''లేదుగా'' అన్నాడు పిల్లాడు.

కొంపదీసి అమ్మ కాదు గద! శేఖరం అమాంతం సైకిలెక్కి పారిపోదామనుకున్నాడు.

''మీ యింట్లో ఎవరెవరుంటారు?''

''మా అమ్మా...నాన్నా మరేమో....తాతయ్యా....పిన్నీ...''

''ఆగు. పిన్ని-మీ పిన్నికి చిన్నాన్న ఉన్నాడా? అదే మీకు చిన్నాన్న ఉన్నాడా?''

''లేడుగా. వస్తాట్ట'' అన్నాడా అబ్బాయి సరదాగా.

అది అర్థమైంది శేఖరానికి. 'రక్షించావుగదరా నా తండ్రీ చిన్నవాడవయినా' అనుకున్నాడు. వో నాణెం తీసి యిద్దరికీ యిచ్చి ఏదన్నా కొనుక్కోండి అన్నాడు. వాళ్లు వెళ్లాక మళ్లీ సందేహం ఒకటి వచ్చిపడింది. 'లేడుగా, వస్తాట్ట' అంటే ఇంకో పూర్ణుంచి కాదు గదా! కాకపోయినా ఎవడన్నా ఉన్నాడేమో!...

వీధి గుమ్మంలో ఆకులు పారేసిన చప్పుడైంది. చట్టున చూచాడు-మెరుపల్లే తళుక్కుమంది! శేఖరం గుండెలు కొట్టుకున్నాయి. ఆమే! సందేహం లేదు 'ఈ తలవెంట్రుకలు మీవిలా ఉన్నై. పారేసుకున్నారు' అని వెళ్లి యిచ్చేస్తే? నవ్వుతుంది. ఏమో, 'ఎందుకు తీశావు నువ్వు?' అని తిడితే? శేఖరానికి తోచలేదు. ఎట్లా? ఆమె ఎవరు?...పెళ్లయిందా లేదా... కాకపోతే పేరూ అవీ ఏమిటి?... ఇవన్నీ తెలుసు కోవాలి. ఇంక అక్కడుండడం దుర్లభంగా తోచింది. సైకిలెక్కి సరాసరి యిల్లుచేరి, మళ్లీ పడకగది చేరాడు.

''నాన్నా-చంద్రం- అట్లా ఉన్నావేం'' అన్నాడు తండ్రి-వస్తూ.

''ఎట్లా ఉన్నానూ -బాగానే ఉన్నాను. నాకేం పిచ్చెత్తనూ లేదు-నేనేం ప్రేమలోనూ ఇరుక్కోలేదు. మామూలుగానే ఉన్నాను. ఎందుకో చిరాగ్గా ఉన్నాను. అంతే'' అన్నాడు శేఖరం. శేఖరం తండ్రి వెళ్లిపోయాడు. తను ఎన్నిసార్లు అడిగినా వీడిట్లా వెర్రిగా వాగుతాడు గాని, సంగతి చెప్పడని, శేఖరం బెస్టు ఫ్రెండయిన రామ్మూర్తికి కబురుచేశాడు - రామ్మూర్తి ద్వారా సంగతి లాగాలని.

తండ్రితో మాట్లాడాక, శేఖరం దగ్గర కొచ్చాడు రామ్మూర్తి.

''ఏం జరిగిందిరా?'' అన్నాడు రామ్మూర్తి.

''ఏమీ జరగలేదనే.''

రామ్మూర్తిని కూచోపెట్టుకుని జరిగిన విషయం అంతా చెప్పాడు శేఖరం. ''ఎట్లాగయినా నువ్వు వివరాలు లాగాలి. నా మనస్సు మనస్సులో లేదు. నాకు జీవించే ఆశ లేదు. నా జీవితం దుర్భరమైపోతుంది. నా కెందుకీ బ్రతుకు? సారా సీసాలు తాగుతూ ఎక్కడెక్కడో తిరగాలి రామ్మూర్తీ - నన్ను రక్షించు'' అన్నాడు శేఖరం భోరున.

''నేను కనుక్కుంటానులే. విచారించకు'' అని లేచాడు రామ్మూర్తి.

ఆ సాయంత్రానికే రామ్మూర్తి వివరాలు తీసుకొచ్చాడు. ఆ అమ్మాయి పేరు సావిత్రి. పెళ్లి కాలేదు-సంబంధాలు చూస్తున్నారు. - కాలేజి చదువుతో ఆపేసింది - పెద్ద స్థితిమంతురాలు కాదు!

''డబ్బుదేముందోయ్- నీ మనస్సు కలిసింది. అదే చాలు'' అన్నాడు రామ్మూర్తి.

''అది చాలదు. పెళ్లో?'' అన్నాడు శేఖరం.

''మాట్లాడదామా''

''మాట్లాడాలి.''

ఆ మర్నాటి ఉదయం లేస్తూనే సైకిలుమీద సావిత్రి వీధిలో తిరగసాగాడు శేఖరం. తానీ సైకిలు మీద నుంచి పోతూవుంటే, సావిత్రి తనో సైకిలు ఎక్కి ఎదురుగా వస్తూ తన సైకిలును ఢీ కొట్టాలి. తాను 'సారీ' అంటాడు ఆమె తరపున. అని వెళ్లిపోతూ వుంటే ఆమె, 'నెవర్‌మైండ్' అని అదోలా చూస్తూ అక్కడే ఉండిపోతుంది! అందుకని, ఏడు గంటలు మొదలుకుని పదిగంటలదాకా సుమారు నూరు ట్రిప్పులు కొట్టాడు. పదో గంట ప్రాంతంలో సావిత్రి డాబామీద కనిపించింది. శేఖరం చూశాడు. సావిత్రీ చూసింది. ఇదే వాళ్ల మొదటిసారి చూసుకోవటం. తొలి చూపులోనే ప్రేమించాలని ఆమె చూపు అటు తిరక్కుండా ఢణాల్‌మని ప్రేమించేశాడు-పైగా మరింత! మామూలుగా సావిత్రి వెళ్లిపోయింది... ఈదురోమని శేఖరం సైకిలూ వెళ్లిపోయింది.

''ఇదండీ సంగతి. మీరు మరి వెనకా ముందూ చూడకుండా వాడికి పెళ్లి చెయ్యాలి. లేకపోతేవాడు గొడవ చేస్తాడు'' అన్నాడు రామ్మూర్తి, సంగతంతా శేఖరం తండ్రి దగ్గర వెల్లడించి.

''వాళ్లెవరో, కులమేమిటో, గోత్రమేమిటో, ఆస్తిపాస్తులేమిటో...''

''ఓ పక్కనించి మీ ఏకైక కుమార రత్నం బెంగటిల్లిపోతూవుంటే మీరింకా కులగోత్రాలు, ఆస్తిపాస్తులూ అంటూ కూచోండి. నాకేం''

''అయితే తప్పదా?''

''తప్పదు, మీరయినా వెళ్లండి, మనిషినయినా పంపించి మాట్లాడించండి'' అన్నాడు. ఆ తర్వాత శేఖరం తండ్రి, భార్యతో విషయం అంతా చెప్పి-

''ఇదే సంగతి. మనం మరి వెనకా ముందూ చూడకుండా వీడికి పెళ్లి చెయ్యాలి. లేకపోతే వాడు గొడవ చేస్తాడు'' అన్నాడు.

''వాళ్లెవరో, కుల మేమిటో, గోత్రమేమిటో ఆస్తిపా....''

''ఓ పక్కనుంచి మన ఏకైక కుమార రత్నం బెంగటిల్లిపోతూఉంటే నువ్వింకా కుల గోత్రాలూ ఆస్తిపాస్తులూ అంటూ కూచో, నాకేం!''

''అయితే తప్పదా''

''తప్పదు. నేవెళ్లి మాట్లాడి వస్తాను'' అని లేచాడు.

''మనం మగపెళ్లివారం. మనమెట్లాపోతామండీ?''

అదీ పాయింటే ననిపించింది ముసలాయనకు.

''ఐనా అటువంటివన్నీ ఆలోచిస్తూ కూచోటానికి ఇది సమయం కాదు కాబోలే'' అన్నాడు.

''ఐతే పురోహితుని పంపండి'' అన్నదామె వూహతట్టి.

''ఆఁ, అతన్ని పంపేద్దాం. మనం వెళ్లితేనే కదా మగపెళ్లివారం వెళ్లినట్టు'' అంటూ లేచి పురోహితుడి కోసం కబురు చేశాడు ముసలాయన.

శేఖరం పడక గది. శేఖరం దిగులుగా జుట్టు దువ్వుకోకుండా అద్దం ముందు కూచుని అద్దంలోకి చూసుకుంటూ ఉండగా అద్దం వెలవెలా బోయింది. 'సావిత్రీ' అన్నాడు అద్దంలోకి చూస్తూనే. 'వూఁ' అని వినిపించింది. వెనక్కు తిరిగాడు- సావిత్రి! పొద్దున్న డాబామీద ఏ భంగిమలో ఎట్లా కనిపించిందో అట్లాగే- అట్లాగే కనిపించింది. శేఖరం 'సావిత్రీ' అని అరిచాడు. ఇంకో మూల కనిపించింది సావిత్రి పకపక నవ్వుతూ. ఈసారి అటు వెళ్లి 'సావిత్రీ' అని మళ్లీ కౌగలించుకున్నాడు. అంతలోనే సావిత్రి, పూలు పెట్టుకునే పొడుగాటి గాజుకుండీలాగా మారిపోయింది. మారిపోవడమే కాదు -

